సాక్షి ఆదిలాబాద్

శనివారం । 23 । డిసెంబర్ । 2023



అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల సాఫ్ట్ బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸

జూడాల నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ జూనియర్ డాక్టర్ల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్‌చారి, ఉపాధ్యక్షులుగా రాజు యాదవ్, కార్తిక్, మౌనిక, సూరజ్, ప్రధాన కార్యదర్శులుగా కారుణ్య కలాంగి, అవినాష్ ఎన్నికయ్యారు. సీనియర్ల సమక్షంలో ఈ కార్యవర్గాన్ని ప్రకటించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /13.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

డీఎంఈని కలిసిన రిమ్స్ డైరెక్టర్



డీఎంఈకి పుష్పగుచ్ఛం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ (డీఎంఈ) డాక్టర్ త్రివేణి, వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్‌ను ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో వారిని వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. రిమ్స్ కళాశాలకు సంబంధించిన విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. డైరెక్టర్ వెంట వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ, నాయకులు అక్బర్, రవీందర్ తదితరులున్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని, ఆ దిశగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. గడువులోగా సిలబస్ పూర్తి చేసి, చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఈవో ప్రణీత, ఎంఈవో జయశీల, సెక్టోరియల్ అధికారి నారాయణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి అండర్ –14 బాలబాలికల ఖోఖో పోటీలు ముగిశాయి. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్, ఫైనల్స్‌లో ఉమ్మడి జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. బాలుర ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా.. రన్నరప్‌గా రంగారెడ్డి, మూడోస్థానంలో మెదక్ జట్టు నిలిచింది. అలాగే బాలికల ఫైనల్స్‌లో ఆదిలాబాద్ జట్టు గెలుపొందగా.. రన్నరప్‌గా మెదక్, తృతీయ స్థానంలో ఖమ్మం జట్టు నిలిచింది. విజేతలకు డీటీడీవో రమాదేవి, ఐటీడీఏ(పీవీటీజీ) ఏపీవో భాస్కర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పోర్ట్స్ అధికారి పార్థసారథి బహుమతులు ప్రదానం చేశారు. కాగా.. ప్రథమ స్థానంలో ఉన్న ఉమ్మడి జిల్లా జట్టు నుంచి నలుగురు, ద్వితీయస్థానంలో ఉన్న జట్టు నుంచి ముగ్గురు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్ల నుంచి ఒక్కో ప్లేయర్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి ఆసిఫాబాద్‌లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, ఎస్‌జీఎఫ్ జిల్లాకార్యదర్శి సాంబశివరావు, జీసీడీవో శకుంతల పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 24న నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్‌జూనియర్ అథ్లెటిక్స్‌మీట్ (నిడ్జమ్) జిల్లాస్థాయి ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డిభోజారెడ్డి, పి.రాజేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్–14,17విభాగాల్లో బాలబాలికలు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రూ.50 ఎంట్రీఫీజు ఉంటుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న 19వ జాతీయస్థాయి అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.ఆసక్తిగలవారు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 9492136510లో సంప్రదించాలని కోరారు.

ముక్కోటికి ముస్తాబు

ముస్తాబైన జిల్లా కేంద్రంలోని మార్వాడి ధర్మశాల శ్రీవేంకటేశ్వర ఆలయం



అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న కళాకారులు



కాంతులీనుతున్న భీంపూర్ మండలంలోని నిపాని వేంకటేశ్వరస్వామి ఆలయం



ఆదిలాబాద్/తాంసి: నేడు వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని జిల్లాలోని వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ముక్కోటి పూజలకు భక్తులు వేకువజాము నుంచే భారీగా తరలిరానున్నారు. ఈమేరకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

సర్దుబాటు.. గందరగోళం

- సబ్జెక్టుతో సంబంధం లేకుండా టీచర్లకు విధులు
- నష్టమే తప్ప ప్రయోజనం లేదంటున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో 115 మందికి ఉత్తర్వులు



డీఈవో కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యాశాఖలో ఉపాధ్యాయుల సర్దుబాటు గందరగోళంగా మారింది. పదో తరగతి విద్యార్థుల చదువు దృష్ట్యా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఇష్టారీతిన ప్రక్రియ చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ఎస్జీటీలను సబ్జెక్టుతో సంబంధం లేకుండా ఉన్నత పాఠశాలలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. విద్యార్థులకు ప్రయోజనం చేకూరడమేమో కానీ నష్టమే తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

సబ్జెక్టుతో సంబంధం లేకుండా..

పదో తరగతి ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఖాళీగా ఉన్న పాఠశాలలకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 115 మందికి విధులు కేటాయించారు. అయితే తెలుగు మీడియంలో బోధించే ఉపాధ్యాయులకు ఉర్దూ, మరాఠీ, హిందీ సబ్జెక్టులు చెప్పాలని ఉత్తర్వులు జారీ చేయడంతో వారు అవాక్కవుతున్నారు. సబ్జెక్టుతో సంబంధం లేనివారికి కూడా విధులు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే విధుల్లో చేరాలని, లేకుంటే చర్యలు చేపడతాని హెచ్చరిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. పనిచేసే మండలంలో కాకుండా ఇతర మండలాల్లో వారికి నచ్చిన చోట విధులు కేటాయించారు.

గందరగోళం..

సబ్జెక్టుతో సంబంధం లేనివారికి విధులు కేటాయించడంతో పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం లేదు. దీంతోపాటు వారు పనిచేసే నుంచి ఇతర పాఠశాలలకు కేటాయించడంతో అక్కడి విద్యార్థులకు కూడా ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఒక్కో ఉపాధ్యాయుడు రెండేసి పాఠశాలలకు వెళ్లి బోధన చేయాలనడంతో వారు ఏ పాఠశాలకు వెళ్లి పాఠాలు చెప్పాలో అర్థంకాని పరిస్థితి.

సర్దుబాటు ఇలా..

- ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ తన సబ్జెక్టు బీఎడ్‌లో సాంఘిక శాస్త్రం కాగా, జెడ్పీఎస్ఎస్ వాగాపూర్‌లో హిందీ చెప్పాలని ఉత్తర్వులు జారీ చేశారు.
- తలమడుగు మండలం ఉండం పాఠశాలలో బోధించే ఎస్జీటీ తన సబ్జెక్టు గణితం కాగా, తలమడుగు పాఠశాలలో బయోసైన్స్ బోధించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- బోథ్ మండలం కరత్వాడ ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ఒకరిని బోథ్ పాఠశాలకు సర్దుబాటు చేశారు. దీంతో ఈ బడి ఏకోపాధ్యాయ పాఠశాలగా మారింది.
- నార్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో తెలుగుమీడియం గణితం బోధించే ఉపాధ్యాయుడికి ఉర్దూ మీడియం బోధించాలని ఉత్తర్వులు జారీ చేశారు.
- బజార్‌హత్నూర్‌లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ టీచర్‌ను ఆదిలాబాద్‌లోని హిందీ మీడియం పాఠశాలకు సర్దుబాటు చేశారు.
- నార్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో ఇద్దరు గణితం ఉపాధ్యాయులు ఉండగా, ఒకరిని గాదిగూడ మండలం ఉన్నతి కార్యక్రమ నోడల్ అధికారిగా విధులు కేటాయించగా, మరొకరికి తెలుగు మీడియం నుంచి ఉర్దూ మీడియంకు సర్దుబాటు చేశారు.
- బేల మండలం మణియార్‌పూర్‌కు చెందిన ఎస్జీటీకి రెండు పాఠశాలల్లో ఫిజిక్స్, గణితం బోధించాలని ఉత్తర్వులు జారీ చేశారు. బేలలో ఉదయం గణితం, మధ్యాహ్నం ఫిజికల్ సైన్స్, మరుసటి రోజు కొగ్దూర్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ బోధించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- బోథ్ మండలం ధన్నూర్ పాఠశాలలో పనిచేసే హెచ్ఎంకు సబ్జెక్టుతో సంబంధం లేకుండా హిందీ బోధించాలని ఉత్తర్వులు జారీ చేశారు.
- బేల మండలం బాది యూపీఎస్‌లో పనిచేసే ఎస్జీటీకి సిర్సన్న పాఠశాలకు ఇంగ్లిష్ బోధించాలని ఉత్తర్వులు జారీ చేశారు. బాది పాఠశాలలో 120 విద్యార్థులు ఉండగా, ఒక్కరు మాత్రమే ఎస్ఏ ఉన్నారు. ఈ టీచర్ ఆ పాఠశాలలో గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులను ప్రస్తుతం బోధిస్తున్నారు. సర్దుబాటుతో ఈ విద్యార్థులకు అన్యాయం జరగనుంది.

'పది' విద్యార్థుల కోసమే..

ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా సర్దుబాటు చేయడం జరిగింది. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం. ఈ సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులు కేటాయించిన పాఠశాలల్లో ఒక సబ్జెక్టు మాత్రమే బోధించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయులు పనిచేస్తున్న సమీప పాఠశాలల్లోనే సర్దుబాటు చేశాం.

– ప్రణీత, డీఈవో

మున్సిపల్ కమిషనర్ మారేనా..?

- జిల్లాకు వచ్చేందుకు ఇద్దరు ఆసక్తి
- జోరుగా పైరవీలు
- ఉన్నతాధికారి మార్పుపై సర్వత్రా చర్చ



ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ శైలజ మారుతున్నారా... ఆమె స్థానంలో కొత్త అధికారి రాబోతున్నారా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ చర్చ జోరందుకుంది. గతంలో ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేసి, ప్రస్తుతం పొరుగు జిల్లాల్లో కమిషనర్లుగా పనిచేస్తున్న ఇదే జిల్లాకు చెందిన ఇద్దరు అధికారులు ఇక్కడికి వచ్చేందుకు యత్నిస్తున్నట్లుగా ప్రచారం సాగుతుంది. ఓ అధికారి స్థానిక ఎమ్మెల్యే ద్వారా పైరవీ చేస్తుండగా, మరొకరు అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల ద్వారా జిల్లాకు వచ్చేందుకు పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది.

కమిషనర్ మార్పు తప్పదా...

గత ప్రభుత్వ హయాంలో నియామకమైన శైలజ కమిషనర్‌గా ఇక్కడ రెండున్నరేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. ఆమెకు అప్పటి అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని, అందుకే పదోన్నతి పొందినా బదిలీ చేయకుండా ఇక్కడే కొనసాగారనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, స్థానికంగానూ బీజేపీ ఎమ్మెల్యే ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే గతంలో పలుమార్లు కమిషనర్ వైఖరిని తప్పుపట్టడం, పలు కాలనీవాసులతో కలిసి ఏకంగా కమిషనర్ చాంబర్ ఎదుటే ధర్నా చేపట్టి నిరసన తెలిపిన విషయం విదితమే. ఈ నెల 19న మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే బల్దియాకు సంబంధించిన పలు అంశాలను తప్పుపట్టారు. ఈ క్రమంలోనే కమిషనర్ మార్పు తప్పదా అనే చర్చ జోరందుకుంది. ఇక్కడ కొనసాగితే భవిష్యత్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడవచ్చనే ఉద్దేశంతో కమిషనర్ కూడా బదిలీకే సుముఖంగా ఉన్నారనే చర్చ కూడా మొదలైంది. ఆమె నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లేక హైదరాబాద్‌లోని కార్పొరేషన్లకు వెళ్లేందుకు యత్నిస్తున్నట్లుగా బల్దియా వర్గాలు చెబుతున్నాయి.

ముమ్మర పైరవీలు

ఇది వరకు ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ఇద్దరు అధికారులు ఆదిలాబాద్ కమిషనర్‌గా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమదైన రీతిలో పైరవీలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. నిర్మల్ జిల్లాలో పనిచేస్తున్న ఓ అధికారి పనితీరు అక్కడ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేకు నచ్చడం లేదని అందుకే సదరు అధికారిని అక్కడి నుంచి బదిలీ చేయించేందుకు ఆ ఎమ్మెల్యే యత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. అలా బదిలీ జరిగితే దూరమైన మరో జిల్లాకు వెళ్లాల్సి వస్తుందనే భావనతో సదరు అధికారి తన సొంత జిల్లాకు వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం ఈ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే ద్వారా జోరుగా పైరవీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఆయన రాకపై వారు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లుగా సమాచారం. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో కమిషనర్‌గా పనిచేస్తున్న మరో అధికారి కూడా ఆదిలాబాద్‌కు వచ్చేందుకు ఆసక్తిగా ఉన్నట్లుగా తెలుస్తోంది. అవకాశం ఉంటే తనను నియమించేలా చూడాలంటూ సదరు అధికారి అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల ద్వారా పావులు కదుపుతున్నట్లుగా సమాచారం.

రాజకీయ నేతల అంతర్మథనం

అయితే పార్లమెంట్ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో కొత్త కమిషనర్ నియామకంపై ఎమ్మెల్యేతో పాటు అధికారి పార్టీ నేతలు అంతర్మథంలో పడ్డట్లుగా తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడితే జిల్లా వాసిగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వారిని జిల్లాకు తీసుకురావాలా లేక ఎన్నికలు ముగిసేవరకు వేచి ఉండటమా అనే దానిపై వారు ఆలోచిస్తున్నట్లుగా చర్చ సాగుతోంది.

'కేంద్రం'.. ప్రచార యాత్ర!

- బీజేపీ సర్కారు పథకాలపై విస్తృత ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో పీఎం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర
- లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజల్లో అవగాహన
- వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు



కుమురంభీం జిల్లా దహెగాం మండలం కోత్మీర్‌లో ప్రచార రథం

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రయోజనం పొందేలా 'ప్రధానమంత్రి భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర' పేరిట విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రతీగ్రామంలో ప్రత్యేక ప్రచార రథాలపై ప్రజలకు ప్రచారం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలు, పది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1510 గ్రామ పంచాయతీల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రతీ శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓ ప్రచార రథం ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ తెరపై వీడియోలు ప్రదర్శిస్తూ కరపత్రాలు, కొత్త సంవత్సర కేలండర్లు అందిస్తున్నారు. ఒక రోజుకు కనీసం రెండు గ్రామ పంచాయతీల చొప్పున వచ్చే జనవరి 26నాటికి ప్రచారం పూర్తిచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత నెల 16న యాత్ర ప్రారంభించగా.. మరో 35రోజులపాటు కొనసాగుతుంది. స్థానిక పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఇతర అధికారులు, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

18పథకాలపై అవగాహన

కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా.. చాలామంది రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగానే భావిస్తుంటారు. దీంతో బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదిన్నరేళ్లలో అమలు చేస్తున్న పథకాలను అందరికీ తెలియజేసేందుకు వికసిత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు. ఈ యాత్రలో మొత్తం 18 కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై వివరిస్తున్నారు. ప్రధానంగా గరీబ్ కల్యాణ్, అన్న యోజన, దీన్ దయాళ్ అంత్యోదయ, జాతీయ గ్రామీణ ఉపాధి మిషన్, ఉజ్వల, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం, అటల్ పింఛన్, పీఎం ఉజ్వల యోజన, పీఎం ఫసల్‌బీమా, ప్రధానమంత్రి ఆవాస్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ముద్ర లోన్లు, ప్రధానమంత్రి విశ్వకర్మ, సురక్ష బీమా, జీవన్‌జ్యోతి బీమా యోజనపై అందరికీ అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రచారరథం వద్దే ఫారాలు నింపి అందజేసే అవకాశం ఇస్తున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద అర్హులైన వారికి యూనిట్లు అందించేందుకు ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

బీజేపీ బలం పెంచేందుకు..

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం తమ పథకాల అమలుతో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలైన ఆదిలాబాద్ పరిధిలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు, పెద్దపల్లి పరిధిలో ఉన్న మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి సెగ్మెంట్లలో పార్టీ బలం పెంచేందుకు ఈ ప్రచార రథాలు ఉపయోగపడుతాయని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. తొలిసారిగా 2019ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎంపీగా సోయం బాపురావు గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా నిర్మల్, ముధోల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు మొత్తంగా నాలుగు చోట్ల కాషాయ జెండా ఎగురవేసింది. ఇదే ఊపుతో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలంటే గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులతో బలం పెంచేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.

సమస్యలపై చర్చ సాగేనా..?

- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
- కొత్త ప్రభుత్వంలో తొలి మీటింగ్‌పై సర్వత్రా ఆసక్తి



జిల్లా పరిషత్ కార్యాలయం

కైలాస్‌నగర్: నేటి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం కావడం, అలాగే బోథ్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో ముగ్గురు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఎన్నికవ్వడంతో చర్చ ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది. ఖానాపూర్‌లో మాత్రమే అధికార పార్టీ ఎమ్మెల్యే ఎన్నికయ్యారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సమావేశం వాడీవేడిగా సాగే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. ఇందులో ఏయే సమస్యలను చర్చిస్తారు.. వాటి పరిష్కారానికి ఎలాంటి భరోసానిస్తారానే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రధాన సమస్యలపై ఫోకస్ ఉంటుందా...

- మరో మూడు నెలలు విద్యాశాఖకు కీలక సమయం. టెన్త్, ఇంటర్ పరీక్షలు ఉంటాయి. ఈ ఫలితాల్లో గతేడాది జిల్లా అట్టడుగు స్థానంలో నిలిచింది. ఈ సారి మాత్రం మెరుగుపర్చాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశించారు. అయితే రెగ్యులర్ డీఈవో లేకపోవడంతో విద్యాశాఖ గాడి తప్పింది. ఇన్‌చార్జీ ఎంఈవోల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. మన ఊరు–మన బడి పథకం కింద చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోగా, కొన్ని చోట్ల పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందని పరిస్థితి. అసంపూర్తి పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో సరైన వసతుల్లేక అవస్థల నడుమ చదువులు సాగిస్తున్నారు.
- పీహెచ్‌సీలు, 24/7 ఆసుపత్రుల్లో రోగులకు అందుబాటులో ఉండి వైద్యమందించాల్సిన డాక్టర్లు ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. కొంతమంది మధ్యాహ్నం వరకే వెళ్లిపోతున్నారు. దీంతో రోగులు ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సిన దుస్థితి. పలుపీహెచ్‌సీల్లో గర్భిణులకు స్కానింగ్ సేవలు అందడం లేదు. రెగ్యులర్ డీఎంహెచ్‌వో లేకపోవడంతో పర్యవేక్షణ లోపిస్తోంది.
- గత ప్రభుత్వం పంట పెట్టుబడి కోసం అమలు చేసిన రైతుబంధు జిల్లాలో ఇంకా చాలామంది రైతులకు అందలేదు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో జరుగలేదు. ఇలాంటి రైతులంతా వ్యవసాయశాఖ కార్యాలయం, మండల వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగాల్సి వస్తోంది.
- కుల వృత్తిపై ఆధారపడ్డ గొల్ల, కుర్మలను ఆదుకోవాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టింది. వీటి కోసం రెండో విడతలో రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించిన 3,597 మందికి ఇంకా గొర్రెల యూనిట్లు అందలేదు. వారు కట్టిన సొమ్ము కూడా తిరిగి చెల్లించలేదు. ప్రభుత్వం మారడంతో ఏం చేయాలో తెలియక వారంతా ఆందోళనలో ఉన్నారు.
- చలి తీవ్రత పెరిగిన నేపథ్యంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు వణుకుతున్నాయి. కిటికీలకు తలుపులు, పడుకునేందుకు బెడ్స్ లేకపోవడంతో వాటిల్లో చదివే పేద విద్యార్థులు చలికి అల్లాడిపోతున్నారు.
- ఆశ్రమ పాఠశాలల్లో వేడి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్లు అధికారుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయంగా మారాయి. పలు చోట్ల భవనాలు అసంపూర్తిగా ఉండగా ప్రహరీలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన దుస్థితి.
- పేదలకు ఆరోగ్య వరప్రదాయనిగా చెప్పుకునే రిమ్స్‌లో మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాల్సిన డాక్టర్లు ప్రైవేట్ ప్రాక్టీస్‌కే ప్రాధాన్యతనిస్తూ రిమ్స్ విధులను విస్మరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగారోగులకు నాణ్యమైన వైద్యం ప్రకటనలకే పరిమితమవుతుంది. ఇటీవల పలువురు మెడికోలు వేర్వేరు ఘటనల్లో మృత్యువాత పడుతుండటం ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపానికి అద్దం పడుతుంది.
- జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. పలు ప్రాంతాల్లో పనులు ప్రారంభించినా అసంపూర్తిగా ఉండడం, ఇంకొన్ని చోట్ల మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడం గమనార్హం. కొన్నిరోడ్లు పూర్తిచేసినప్పటికీ బిల్లులురావడం లేదని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు వస్తాయనే ఉద్దేశంతో అడ్వాన్స్‌గా పనులు చేస్తే వాటికి బిల్లులు రావడం లేదని చాలామంది లబోదిబోమంటున్నారు.

మారిన పార్టీల బలబలాలు

జెడ్పీలో ప్రధాన పార్టీల బలబలాలు ప్రస్తుతం మారాయి. మొత్తం 17మంది సభ్యులకుగాను బీఆర్ఎస్‌కు చైర్మన్‌తో కలిపి ప్రస్తుతం ఎనిమిది మంది ఉన్నారు. ఆ పార్టీ తొమ్మిది జెడ్పీటీసీలు గెలుపొందగా ఆదిలాబాద్ రూరల్ జెడ్పీటీసీ ఆరె రాజన్న మృతి చెందారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నేరడిగొండ జెడ్పీటీసీ జాదవ్ అనిల్‌కుమార్ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడంతో తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ సంఖ్య ఏడుకు తగ్గగా కాంగ్రెస్ ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు ఎన్నికవ్వగా ఒకరు బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ సంఖ్య రెండుకు తగ్గింది. తాజాగా సిరికొండ బీజేపీ జెడ్పీటీసీ సభ్యురాలు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ సంఖ్యలో మార్పు రాలేదు. అయితే బీజేపీ సభ్యుల సంఖ్య గతం కంటే ఒకటి తగ్గింది. ఆ పార్టీ తరపున ఐదుగురు గెలుపొందగా ఒకరు పార్టీ మారడంతో ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారు.

క్లుప్తంగా

అటవీ అధికారులకు జింక అప్పగింత


జింకను అప్పగిస్తున్న పోలీసులు

తానూరు: గాయాల పాలైన జింకను శుక్రవారం అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఏఎస్సై నిర్సింగ్ బాను తెలిపారు. కోలూరుతాండ శివారు ప్రాంతంలో జింకపై కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు అటవీ శాఖ అధికారుల సమాచారం అందించి వారికి జింకను అప్పగించారు. బాసరకు తరలించి ప్రథమ చికిత్స అందిస్తామని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

పీవోను కలిసిన ఆర్టీసీ డీఎం


పీవోకు మొక్క అందిస్తున్న డీఎం

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ని శుక్రవారం ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవింగ్‌పై ఆసక్తి గల అభ్యర్థులకు టీఎస్ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మేధో విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా 'తుల'


తుల అరుణ్‌కుమార్

బోథ్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మేధోవిభాగం(విచార్ విభాగ్) రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ విచార్ విభాగ్ చైర్‌పర్సన్ గిరిజవ్యాస్ నియామకపత్రం అందజేశారు. తుల అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో వంద సీట్లు సాధించే దిశగా కసరత్తు చేస్తామన్నారు.

అసిస్టెంట్ ఎడిటర్‌గా రాణిస్తున్న విష్ణు


విష్ణు

కడెం(ఖానాపూర్): కడెంకు చెందిన యువకుడు సినిమా రంగంలో అసిస్టెంట్ ఎడిటర్‌గా రాణిస్తున్నాడు. మ ండల కేంద్రానికి చెంది న రామగిరి లత–శ్రీనివాస్ దంపతుల కుమారుడు రామగిరి విష్ణు ఇటీవల విడుదలైన యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్' సినిమాకు అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేశాడు. త్వరలో రాబోయే..మ్యాడ్ తెలుగు, గ్యాంగ్ ఆఫ్ గోదావరి, లక్కీ భాస్కర్ చిత్రాలకు సైతం అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 10 ఉమ్మడి జిల్లాల నుంచి 340 మంది క్రీడాకారులు హాజరు


సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్న పోటీలను నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 340 మంది క్రీడాకారులు, 20 మంది కోచ్‌లు, 20 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటిరోజు నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ బాలుర జట్టుపై నిజామాబాద్, హైదరాబాద్ జట్టుపై ఆదిలాబాద్, నల్గొండ జట్టుపై ఖమ్మం జట్టు విజయం సాధించాయి. కరీంనగర్ బాలికల జట్టుపై వరంగల్, రంగారెడ్డి జట్టుపై మెదక్, నల్గొండ జట్టుపై నిజామాబాద్ జట్టు విజయం సాధించాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బికనూర్‌లో జనవరి 11 నుండి 15 వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారి పద్మ, జిల్లా యువజన క్రీడల అధికారి నాపేఖాన్, పేట సెక్రటరీ భోజన్న, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, పీఈటీలు భూమన్న, రామారావు, జమున, తదితరులు పాల్గొన్నారు.


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికల జట్టు


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలుర జట్టు

నిర్మల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉంది

నిర్మల్ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగడం చాలా సంతోషాన్నిచ్చింది. పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి పది జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాం. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పట్టుదలతో ఆడి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలి.

– ఆశీష్ సంగ్వాన్, నిర్మల్ కలెక్టర్

క్రీడలు అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. నాలుగో తరగతి నుంచి సాఫ్ట్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు తొమ్మిదో తరగతి. ఇప్పటి వరకు ఒకసారి రాష్ట్రస్థాయి, రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– ఏ.జయశ్రీ, మెదక్ జట్టు

జాతీయస్థాయికి ఎంపికవుతా



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయస్థాయిలో పాల్గొనాలనేది నా లక్ష్యం. గుర్తింపు పొందాలనేదే నా కల.

– సోనాలిక, ఆదిలాబాద్ జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. సంవత్సరం ముందు నుంచి సాఫ్ట్‌బాల్ నేర్చుకున్నా. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్నా. జాతీయ స్థాయికి ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబరచాలన్నదే నా లక్ష్యం.

– లోకేశ్, హైదరాబాద్ జట్టు

కోచ్‌గా గుర్తింపు పొందాలి



మూడేళ్లుగా కరీంనగర్ విద్యార్థులకు సాఫ్ట్‌బాల్ కోచింగ్ ఇస్తున్నా. ఇప్పటి వరకు నా వద్ద కోచింగ్ తీసుకున్న 13 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఆడారు. మంచి కోచ్‌గా మంచి గుర్తింపు పొందాలన్నదే నా లక్ష్యం.

– గంగాధర్, కరీంనగర్ జట్టు కోచ్

జిల్లాకు పేరు వస్తుంది



నిర్మల్ పట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 10 ఉమ్మడి జిల్లాల నుంచి 20 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు ఇక్కడ నిర్వహించడంతో నిర్మల్ జిల్లాకు ఎంతో పేరు వస్తుంది.

– రమణారావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

రెబ్బెన(ఆసిఫాబాద్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ సినీ నటుడు నాజర్ అన్నారు. శనివారం నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హెచ్ఏఎల్ గ్రౌండ్స్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషులు, మహిళల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. నాజర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడాకారుల జాబితాను ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, పీఈటీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కోశాధికారి శంకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారుడు మల్లేశ్ పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు శ్రావణ్, తిరుపతి, సిద్ధార్థ రాజ్, పవన్, తరుణ్, నరేశ్, సూర్య, శ్రీకాంత్, సాయిచరణ్, గోపాల్ ఎంపిక కాగా.. స్టాండ్‌బైగా దిలీప్, దేవరాజ్‌లు ఎంపికయ్యారు. మహిళల జట్టుకు స్వప్న, అంజలి, శ్రీవిద్య, శ్రావణి, విష్ణుప్రియ, శ్రీస్ఫూర్తి కారుణ ప్రజ్వలశ్రీ, అస్మిత, నవ్య, లక్ష్మితోపాటు కోచ్‌గా శృతిని ఎంపిక చేశారు.

జాతీయస్థాయి పోటీలో విద్యార్థి ప్రతిభ

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఈ నెల 16 నుండి 20 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించిన 67వ జాతీయస్థాయి 4/100 పరుగు పందెం పోటీల్లో స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి రాథోడ్ విక్రం ప్రతిభ కనబరిచాడు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ఉత్తం, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్, ఉపాధ్యాయులు ఉపేందర్, మనోజ్ కుమార్, మాధవరావు, జావేందర్, శ్యాంరావు, బలిరాం, కాశీరాం, మహేందర్ విద్యార్థిని సన్మానించారు.


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యం చేరుకుంటామని ఆర్సీవో గంగాధర్ అన్నారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రదీప్, ఉమేశ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నళినీరెడ్డి

ఎదులాపురం: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ 98 ఏళ్లుగా నిర్విరామంగా పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ముడుపు నళినీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో శుక్రవారం పార్టీ 99వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి గణనీయమైన చరిత్ర ఉందన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడుతూ హక్కులు సాధించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కంద్యాల గణేశ్, రామగిరి హరికిషన్, సుఖ్‌దేవ్, పద్మ, స్వప్న, చందు, శంకర్, గంగమ్మ, గిరి, దత్తు, పోచ్చిరామ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ముడుపు నళినీరెడ్డి

అక్రమ నిర్మాణాల తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఎన్టీఆర్ మార్గంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం మున్సిపల్ అధికారులు జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లేక్ కమిటీ ఫిర్యాదు మేరకు ఈ కట్టడాన్ని పోలీస్ భద్రత మధ్య తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ నుంచి ఎలాంటి అనుమతులు, సెట్ బ్యాక్‌లు లేకుండా భవనాలు నిర్మించవద్దని సూచించారు. టీపీవో సుమలత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


జేసీబీతో తొలగిస్తున్న అధికారులు


నేడు ఎస్టీయూ ఆధ్వర్యంలో సమావేశం

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల అమలుపై చర్చించేందుకు శనివారం నిర్మల్‌లోని సంఘ భవనంలో సాయంత్రం ఐదు గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, జె.లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వత్‌రెడ్డి, జి.సదానందం గౌడ్ హాజరవుతారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్, ఎంఈవోలు, తొలిమెట్టు నోడల్ అధికారులు, ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, విద్యావేత్తలు, వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రేపు డయాలసిస్ సేవలు ప్రారంభం

భైంసాటౌన్: భైంసాలోని ప్రభుత్వ ఏరియా స్పత్రిలో 'డయాలసిస్ సేవలు ఎప్పుడో' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం నుంచి ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌ను కలిసి ఈ విషయమై వివరించినట్లు పేర్కొన్నారు. భైంసా పరిధిలో 25మంది డయాలిసిస్ రోగులున్నట్లు గుర్తించామని తెలిపారు. ఎమ్మెల్యే రామారావుపటేల్ చేతుల మీదుగా సేవలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఆకస్మిక తనిఖీ


ఎక్బాల్‌పూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో..

ఖానాపూర్: ఎక్బాల్‌పూర్, తర్లపాడ్ గ్రామాల్లో శుక్రవారం జిల్లా ప్రణాళిక అధికారి మల్లికార్జున్ ఆకస్మికంగా పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్లను పరిశీలించారు. ఎంపీవో చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీలత, నిర్మల, నాయకుడు పెద్ది నర్సయ్య ఉన్నారు.

వైద్యశిబిరాల్లో గిరిజనులకు మెరుగైన వైద్యం

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకే 'హెల్త్ టూ హోమ్' పేరుతో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాబేఝరిలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా ప్రత్యేక మొబైల్ వాహనం, ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్యం చేయించుకోవాలని గిరిజనులను కోరారు. ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లతో అవగాహన కల్పించాలన్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు, వైద్యులు సంజీవ్, మేఘన, రవుఫ్, రాజమణి, సీహెచ్‌వో రాథోడ్ తులసిదాస్, లక్ష్మి, హెచ్ఈవో శిరిష్, హెచ్ఎస్ చరణ్‌దాస్, పంచాయతీ కార్యదర్శి విజయ్, సిబ్బంది ఈశ్వర్, హిమబిందు, గోకుల్, బాపురావు, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ రమిత్ మౌర్య

తాంసి(బోథ్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ రమిత్ మౌర్య కోరారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా శుక్రవారం తాంసి మండల కేంద్రంలో ఉన్నతాధికారులతో కలిసి గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి కేంద్ర పథకాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మారుమూల గ్రామాల ప్రజలకు పథకాల ప్రయోజనం అందించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ కిషన్, సర్పంచ్ స్వప్న, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌బాబు, కేవీకే శాస్త్రవేత్త రాజశేఖర్, ఏవో రవీందర్, వికసిత్ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, ఏఈవో నిఖిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమిత్ మౌర్య

ట్రిపుల్‌ఐటీలో రామానుజన్ జయంతి

భైంసా(ముధోల్): గణిత మేధావి రామానుజన్ 137వ జయంతి వేడుకలను శుక్రవారం బాసర ట్రిపుల్‌ఐటీలో ఘనంగా నిర్వహించారు. పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణతో పాటు అధ్యాపకులు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అని వీసీ కొనియాడారు. ఉత్తమ ఇంజనీరింగ్ విద్యార్థిగా రాణించాలంటే గణిత శాస్త్రంపై పట్టు ఉండాలన్నారు. గణితశాస్త్రానికి, సాంకేతిక విద్యకు దగ్గరి సంబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఆడెపు మధుసూదన్, డా. పావని, సృజన, డా.దత్తు, తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న వీసీ వెంకటరమణ

బస్సుల్లో ప్రయాణికుల రద్దీ


బస్సు రావడంతో ఎక్కేందుకు ఎగబడుతున్న జనం


బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- రద్దీకి అనుగుణంగా పెరగని సర్వీసులు
- గురువారం ఒక్కరోజే భైంసాలో 130 ఓఆర్ శాతం

భైంసాటౌన్(ముధోల్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. బస్సులన్నీ దాదాపు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బస్టాండ్ ప్రాంగణం సైతం రద్దీతో కిక్కిరిసి కనిపిస్తోంది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నేపథ్యంలో బస్సుల కోసం వేచి చూస్తున్నారే తప్ప ఇతర వాహనాలను ఆశ్రయించడం లేదు. ఫలితంగా బస్టాండ్‌లో జనసందోహం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, భైంసా ఆర్టీసీ డిపో పరిధిలో 73 సర్వీసులు నడుపుతుండగా, గతంలో 60–70 శాతం మాత్రమే ప్రయాణికుల రద్దీ ఉండేది. మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంలో 80–90 శాతానికి పెరిగింది. భైంసా ఆర్టీసీ డిపోలో గురువారం ఒక్కరోజే 91శాతం ఓఆర్ నమోదైంది. ఇక శుక్రవారం సైతం భైంసా ఆర్టీసీ బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ నెలకొంది. బస్సులు సకాలంలో లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తూ కనిపించారు. బస్సు రావడంతో సీట్ల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రుణాలతో ఆర్థికంగా ఎదగాలి

తానూరు: ఖాతాదారులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని టీజీబీ ఆర్ఎం రామారావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తెలంగాణ గామీణ బ్యాంక్‌లో ఖాతాదారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్య, వ్యాపార, వాహన, గృహ నిర్మాణంతోపాటు స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తానూరు బ్యాంక్‌లో రూ.103 కోట్ల లావాదేవీలు చేపట్టినందుకు సిబ్బందిని అభినందించారు. తానూరు బ్యాంక్‌లో రూ.వెయ్యి చెల్లించి ప్రమాద బీమా తీసుకున్న జింకల్‌కర్ గంగాధర్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన పేరిట మంజూరైన రూ.20 లక్షల బీమా చెక్కును ఆయన భార్య సాగరాబాయి, కుటుంబీకులకు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పి.సుధాకర్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక్, సిబ్బంది రాకేశ్, గంగరాజన్ ,శ్రీనివాసులు, లక్ష్మణ్, రాజు, శ్రీకాంత్, నారాయణ్, సర్పంచ్ విఠల్, పండరి, శివాజీపటేల్ పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఆర్ఎం, బ్యాంక్ సిబ్బంది

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి..

- కలెక్టర్‌కు చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి ఆదేశం

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తమను వేధిస్తున్నాడని విద్యార్థులు ఇటీవల ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే చర్యల్లో భాగంగా డీఈవో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఐసీపీఎస్ అధికారులు సైతం విచారణ జరిపి సీడబ్ల్యూసీకి నివేదిక సమర్పించారు. విద్యార్థుల ద్వారా లిఖితపూర్వకంగా రాయించుకొని నేరడిగొండ స్టేషన్‌లో సదరు ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తాజాగా చైల్డ్‌రైట్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్కె స్వరూపరాణి సదరు ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు డీఈవోకు ఆదేశాలు జారీ చేశారు. విచారణకు సంబంధించిన నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన

నేరడిగొండ(బోథ్): తమ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కళాశాల విద్యార్థులు అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ బోర్డ్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరైన రూ.9.20 లక్షలతో కళాశాల ఆవరణలో ఇటీవల ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేశారు. అటవీ శాఖ అధికారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. దీనిని నిరసిస్తూ స్థానిక అటవీ శాఖ రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపాల్ శబానతరన్నమ్ మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం 2 ఎకరాల 18 గుంటల ఆర్ఓఎఫ్ఆర్ భూమిని కళాశాల నిర్మాణం కోసం కేటాయించారని, దానికి సంబంధించిన భూ పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. గతంలో కూడా కళాశాలకు అదనపు గదులు మంజూరు కాగా అప్పుడు కూడా అటవీ శాఖ అధికారుల వల్ల అవి కట్టలేక పోయామన్నారు. ఇప్పుడు కూడా మరుగుదొడ్ల నిర్మాణ పనులను నిలిపివేశారన్నారు. అనంతరం డెప్యూటీ రేంజ్ అధికారి సవితకు వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం ఇస్తున్న లెక్చరర్లు, విద్యార్థులు